అగ్రిగోల్డ్ ఖాతాదారులకు భరోసా కల్పించాలి

ప్రజాశక్తి-కొమరాడ

అగ్రిగోల్డ్ భూముల వ్యవహారం కోర్టులో ఉందంటూ చెప్పడమే తప్ప ఇంకెన్ని సంవత్సరాల్లో ఈ సమస్య పరిష్కారం చేస్తారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. మండలంలోని చోల్లపదం గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారికి ఆనుకుని ఉన్న అగ్రిగోల్డ్ భూములను సిపిఎం, రైతు సంఘం, గిరిజన సంఘం నాయకులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు ఏళ్ల తరబడి డబ్బులు చెల్లించకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. అగ్రిగోల్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఖాతాదారులకు బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, గిరిజన సంఘం నాయకులు సత్యం పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యపై

వెల్లువెత్తిన నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారంపై జిల్లాలో శనివారం నిరసనలు వెల్లువెత్తాయి. వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్య బందం, సిబ్బంది ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్సు కూడలికి ర్యాలీగా చేరుకున్నారు. వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు నల్ల రిబ్బన్లు ధరించి, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి చేసి, హత్య చేసిన ముష్కరులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి, రీజనల్ మెడికల్ ఆఫీసర్ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి అధ్వర్యాన వైద్యులు, సిబ్బంది బోసు బొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు శామ్యూల్ రాజు, విఆర్ మీనాక్షి, వినోద్, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం.. నిరసన ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది

కురుపాం : జూనియర్ డాక్టర్‌పై హత్యాచార యత్నానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె.సందీప్ కుమార్ డిమాండ్‌చేశారు. శనివారం మండల కేంద్రంలో సిహెచ్‌సి నుంచి కురుపాం ప్రధాన రహదారి వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జి.మౌనిక, పి.సుక్రిత, స్వాతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : జూనియర్ డాక్టర్‌పై హత్యాచారయత్నానికి వ్యతిరేకంగా చినమేరంగి సిహెచ్‌సి వైద్యాధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యాన వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

సీతానగరం : స్థానిక పిహెచ్‌సి నుంచి బజారు వరకు వైద్యులు, సిబ్బంది ర్యాలీ చేపట్టారు. వైద్యులు ఎం.రాధాకాంత్, పి.ఉష, ఇఒ జి.సూర్యనారాయణ, సిహెచ్ఒ ఎస్‌వి రమణ, సత్యవతి, గోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార సంఘటన ఖండిస్తూ సీతంపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. అనంతరం దోనుబాయి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానహారం చేపట్టి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజేష్, శ్రీనివాసరావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యపై డాక్టర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు అరుణ్ కుమార్, శామ్యూల్, శ్రీధర్, తనూజ, గణేష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : కోల్‌కతా ఘటనకు నిరసనగా వీరఘట్టం, బిటివాడ వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, నితీశ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పిహెచ్‌సి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు, అక్కడి నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన్‌రావు, శాంతి కుమారి, ఆదిలక్ష్మి, లలిత కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : డాక్టర్‌పై అత్యాచారానికి నిరసనగా భద్రగిరి సిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ చేశారు. గుమ్మలక్ష్మీపురం నుండి ఎల్విన్ పేట వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో వైద్యులు దుర్గాప్రసాద్, తారాని ఉన్నారు.

గరుగుబిల్లి : కోల్‌కత్తా ఘటనపై రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కీర్తి ఆధ్వర్యాన సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంపిహెచ్ఇఒ ఎస్ఎస్ ప్రకాష్, హెచ్.వి సన్యాసమ్మ, హెల్త్ అసిస్టెంట్ గుంట్రెడ్డి సురేష్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఎం.గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

భామిని : కోల్‌కతా ఘటనను నిరసిస్తూ భామినిలో మూడు పిహెచ్‌సిల వైద్యులు, సిబ్బంది నిరసన చేపట్టారు. అంబేద్కర్ కూడలిలో మానవహారం చేశారు. కార్యక్రమంలో వైద్యులు పి.సోయల్, దీపికారాణి, దామోదరరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి అప్పారావు, సిహెచ్ఒ భాస్కరరావు పాల్గొన్నారు.

పార్వతీపురంలో మానవహారం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

సీతానగరం.. నిరసన ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జిల్లా సమగ్రాభివృద్ధికి

వంద రోజుల విజన్

నివేదికలు తయారు చేయాలి ● అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

జిల్లా సమగ్రాభివృద్ధికి వంద రోజుల విజన్‌తో ముందుకెళ్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వెల్లడించారు. అందుకు అవసరమైన నివేదికలను అన్ని శాఖలు తక్షణం తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రాథమిక రంగాల శాఖలతో జిల్లా కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్టడుగు స్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చేలా శాఖల విజన్ ఉండాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని అవసరమగు చర్యలు చేపట్టాలని సూచించారు. సామాన్యుడికి ఫలాలు అందాలని, జిల్లా స్థాయి నుంచి కుటుంబ స్థాయి వరకు ఒక యూనిట్‌గా ప్రణాళికలు రచించాలని ఆయన సూచించారు. అప్పుడే విజన్ డాక్యుమెంట్‌కు సార్థకత చేకూరుతుందన్నారు. ప్రతి అంశానికి సంబంధించి విలువ ఆధారిత జోడించి కార్యాచరణ చేయాలని ఆయన అన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, పరిస్థితులు, అభివృద్ధికి గల అవకాశాలను పేర్కొంటూ వంద రోజుల డాక్యుమెంట్ రూపకల్పన జరగాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆరోగ్యం, సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, స్థిరమైన అభివృద్ధి వివరాలను పొందుపరచాలని ఆయన ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ డాక్యుమెంట్ ఎంతో అవసరమని తెలిపారు. 2024 నుండి 2029 వరకు శాఖల వారి అభివృద్ధికి ప్రణాళికలు అవశ్యమన్నారు. ప్రతి ఏడాది కనీసం 15 శాతం వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ప్రణాళికల రూపకల్పనలో ఆర్థిక, భౌతిక లక్ష్యాలు స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించారు. ఏ పథకం కింద ఏ మేరకు అమలు చేయగలమో పరిశీలించి, వాస్తవాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక తయారు కావాలని స్పష్టంచేశారు. ఈ నెల 26 నాటికి ముసాయిదా నివేదిక సమర్పించాలన్నారు.

జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు మాట్లాడుతూ విలువ ఆధారిత ఉండే విధంగా ప్రతి అంశానికి రూపకల్పన చేసి, సామర్థ్యాలు గుర్తించాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఒ జి.కేశవ నాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిఎంహెచ్ఒ జి.పగడాలమ్మ, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం రుక్మాంగదయ్య, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, ఎపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ బి.హరిబాబు, ఆర్‌అండ్‌బి ఇంజినీరింగ్ అధికారి ఎం.జేమ్స్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారం మొక్కుబడి కారాదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సగటు మనిషి లేదా కుటుంబ జీవితం భూమితో ముడిపడి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే రెవెన్యూ అధికారుల పెన్ను మొన కూడా పొరపాటున పడితే సంబంధిత కుటుంబ ఆర్థిక స్థితిగతులు పూర్తిగా తారుమారవుతాయి. ఇటువంటి తప్పొప్పులకు గ్రామాల్లో పనిచేసే విఆర్ఒ చాలు. కానీ, ఆయా తప్పులను సరిచేయాలంటే నేటి రెవెన్యూశాఖ పనితీరును బట్టి సగటు మనిషి జీవిత కాలం కూడా సరిపోని పరిస్థితి దాపురిస్తోంది. బహుశా అందుకే ఇతర సమస్యలతో పోల్చుకున్నప్పుడు భూ సమస్యలపై ఎక్కువగా వినతులు వస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం భూదాహానికి బరితెగించిన సందర్భాలు అనేకం. మరో అడుగు ముందుకు వేస్తే దళితులు, కొందరు బిసిల అభ్యున్నతికి పూర్వం ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం ఎంతో మంది పెత్తందారులు, రాజకీయ నాయకులు వశపర్చుకుంటునే ఉన్నారు. ఎన్నో చట్టాలు ఉన్నా వాటిలో లొసుగులను తమకు అనుకూలంగా మార్చు కుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకించి రెవెన్యూ రికార్డుల పరిశీలన, భూ వివాదాలపై వినతుల స్వీకరణ కోసం ప్రత్యేకించి మన జిల్లాకు ఏకంగా రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా రావడం అభినందనీయమే. కానీ, రికార్డులను ప్రక్షాళన చేయడంతోపాటు భూ సమస్యలను పరిష్కరించేందుకే వచ్చానంటూ సిసోడియా చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారులు కూడా ఇదే విషయాన్ని నొక్కిచెప్తున్నారు. త్వరలో రెవెన్యూ సదస్సులు కూడా గ్రామ స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమ వుతోంది. ఈ నేపథ్యంలో భూ సమస్యలపై ప్రభుత్వం లోతుల్లోకి వెళ్లి పరిష్కారం చూపుతుందా? లేక గత ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలు, జగనన్న కాలనీలు తదితర పేర్లతో సేకరించిన భూమి కొనుగోలు, చెల్లింపులు వ్యవహారాలకే పరిమితమౌతుందా? అన్నది పబ్లిక్ టాక్. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరిట పనికి రాని భూములను రూ.కోట్లు చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో, చాలాచోట్ల ఇళ్ల పట్టాలు తీసుకునేందుకు కూడా లబ్ధిదారులు ముందుకు రాలేదు. రాష్ట్రంలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందిన గుంకలాం లేఅవుట్ స్థలం కొనుగోలు మొదలుకుని, కేటాయింపుల వరకు అవినీతి జరిగిందని అప్పట్లో సాక్షాత్తు అధికార పార్టీ నాయకులే బహిరంగ చర్చకు తెరలేపారు. అటు పార్వతీపురం జిల్లా కేంద్రంలోని పేదలకు పెదమరికి కొండవాలు ప్రాంతంపై స్థలాలు ఇచ్చారు. వీటితోపాటు అనేక చోట్ల రూ.కోట్ల అవినీతి జరిగిందన్నది అప్పట్లో బహిరంగ చర్చ నడిచింది. మరోవైపు 20ఏళ్లకు మునుపు పొందిన అసైన్డ్ భూములను సంబంధిత దళితులు, ఇతర వెనుకబడిన తరగతుల పేదలకు రెగ్యులర్ చేస్తామంటూ గత ప్రభుత్వం జిఒ జారీచేసిన సంగతి తెలిసిందే. ఆచరణలో వాటిలో ఎక్కువ భాగం అప్పటి ప్రభుత్వంలోని అధికారులు, నాయకులే కొనుగోలు చేసినట్టు విమర్శలు వచ్చాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో కొన్ని దందాలు, అక్రమ కొనుగోళ్లు రెండు నెలల క్రితం ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చిన సంగతి కూడా తెలిసిందే. ఇంకా లోతుల్లోకి వెళ్తే దళితుల పేరున ఉన్న అసైన్డ్ భూములను రికార్డుల్లో తారుమారు చేశారు. ఇటువంటివి మెంటాడ, వేపాడ మండలాల్లో కొకొల్లలుగా ఉన్నాయి. గిరిజన ప్రాంతంలో పెత్తందారుల ఆక్రమణలకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, రాజకీయ జోక్యం, పార్టీల ప్రమేయం పక్కనబెట్టి ఈ భూ ఆక్రమాలన్నీ వెలికి తీయాలని, పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జనం చర్చించు కుంటున్నారు. కేవలం గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపైనే చర్చ నడిస్తే అది కేవలం కక్ష సాధింపుగానే మిగిలిపోతుంది తప్ప, పేదలకు ఒరిగిందేమీ లేదని కూడా పబ్లిక్ టాక్.

సర్వసభ్య సమావేశంలో ఇంత నిశ్శబ్దమా?

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-మక్కువ

'సర్వసభ్య సమావేశాలంటే ప్రశ్నలతో హీటెక్కిపోతుందేమో అనుకున్నాను. ఇక్కడ చూస్తే ఏ ఒక్కరూ ప్రశ్నించడం లేదు. అసలు సమావేశాలంటే ఇంత నిశ్శబ్దంగా జరుగుతాయా?' అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య ఉండకూడదని స్పష్టంచేశారు. మండలానికి వచ్చే రహదారులు పూర్తి అధ్వానంగా మారాయని, ఏ విధమైన ప్రమాదం జరిగినా దానికి బాధ్యత ఎవరిదని ఆర్‌అండ్‌బి అధికారులను ప్రశ్నించారు. ప్రమాదం బారిన పడిన తర్వాత వ్యక్తులు చనిపోతే క్షమాపణ చెప్పడం సరికాదు కదా? అన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మర్రిపారమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.

మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్‌పిటిసి శ్రీనివాసరావు

విమానంలో మృతదేహాల తరలింపు

- గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి
- ఉపాధ్యాయుల బంధువులకు ఓదార్పు

ప్రజాశక్తి- పాచిపెంట, సాలూరు

కొండవాగుగెడ్డలో కొట్టుకుపోయిన కొటికపెంట ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల మృతదేహాలను విమానంలో వారి సొంత రాష్ట్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల మృతదేహాలకు త్వరగా పోస్ట్ మార్టం పూర్తి చేసి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఏరియా ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. శనివారం ఉదయం ఆమె ఏరియా ఆసుపత్రిలో ఉన్న ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారితో మాట్లాడారు. సంఘటన జరిగిన తీరు గురించి ప్రిన్సిపల్‌ని అడిగి తెలుసుకున్నారు. ఫోన్లో మృతుల బంధువులతో మాట్లాడి ఓదార్చారు. మక్కువ మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న తర్వాత విలేకరులతో ఆమె మాట్లాడారు. గెడ్డ వాగులో కొట్టుకుపోయిన ఉపాధ్యాయుల మృతదేహాల తరలింపు గురించి సిఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడగా ఎయిర్ బస్‌లో తరలించేందుకు అంగీకరించారని తెలిపారు. ఒక్కో మృతదేహం తరలించడానికి రెండు లక్షల రూపాయలు ఖర్చయినా మానవతా దృష్టితో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మాజీ మంత్రి రాజన్నదొరకి సిఎం చంద్రబాబును విమర్శించే స్థాయి లేదన్నారు. ఆయన మంత్రిగా, ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఏమి చేశారో అందరికీ తెలిసిందేనని వ్యాఖ్యానించారు.

ఉపాధ్యాయుల బంధువులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ఉపాధ్యాయుల మృతికి కారణమైన కొండమాను వాగును పార్వతీపురం ఆర్‌డిఒ హేమలత పరిశీలించారు వాగుపై హైలెవెల్ బ్రిడ్జి అవసరమని ఆమె గుర్తించారు. ఈ వాగు మీదుగా వెళ్లాల్సిన గిరిజన గ్రామాలు ఎన్ని ఉన్నాయి? అని ఆర్ఐ రమణారావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విఆర్ఒ మురళి ఉన్నారు.

ప్రభుత్వానికి మానవత్వం లేదా?

కూటమి ప్రభుత్వానికి మానవత్వం లేదా? అని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రశ్నించారు. ఏకలవ్య గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు మహేష్, ఆర్తి మృతదేహాలను ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం వారి బంధువులను ఓదార్చారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబుతో ఫోన్‌లో మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల మృతదేహాలను విమానం ద్వారా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, విద్యాశాఖ మంత్రి లోకేష్, సిఎం చంద్రబాబు నాయుడు స్పందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మానవత్వం చూపాలని విజ్ఞప్తిచేశారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కింద ఆయన రూ.10 వేలు అందించగా, వారు సున్నితంగా తిరస్కరించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రాజన్నదొర, డివిజి శంకరరావు

ఘటనా స్థలాన్ని పరిశీలన

ఏకలవ్య ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు మృతికి కారణమైన పాచిపెంట మండలం సరాయివలస కొండమాను గెడ్డను శనివారం ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు, మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్న దొర పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలల్లో కేంద్రీకృత బదిలీలతో బోధన, బోధనేతర సిబ్బంది ఇబ్బందులు పడే అవకాశం ఉందని గతంలో తెలిపామన్నారు. బదిలీలు రాష్ట్ర పరిధిలో జరిగితే సమస్యలు ఉండవని చెప్పారు. కొంత మేరకు భాష సమస్య కూడా ప్రమాదానికి కారణమని వారు అన్నారు.

ఉపాధ్యాయుడు మృతదేహం లభ్యం

కొండవాగుగెడ్డలో కొట్టుకుపోయిన ఉపాధ్యాయుడు మహేష్ మృతదేహం శనివారం ఉదయం వాగుకు కొంత దూరంలో లభ్యమైంది. శుక్రవారం సాయంత్రం ఏకలవ్య ఆశ్రమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఆర్తి (26), వార్డెన్ మహేష్ (31) కొండవాగులో కొట్టుకుపోయారు. పోలీస్ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టడంతో అదే రోజు రాత్రి ఆర్తి మృతదేహం లభ్యమైంది. శనివారం ఉదయం విశాఖపట్నం ఎస్‌డిఆర్ఎఫ్ బృందం, స్థానిక రెవిన్యూ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం తొమ్మిది గంటల సమయంలో వార్డెన్ మహేష్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని సాలూరు సిహెచ్‌సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ నారాయణరావు, తహశీల్దార్ డి.రవి తెలిపారు.

మహేష్ మృతదేహాన్ని వెలికితీసిన ఎస్‌డిఆర్ఎఫ్ బృందం

మృతదేహాలను హర్యానా తరలించాలి

గెడ్డవాగులో కొట్టుకుపోయిన ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల మృతదేహాలను వారి సొంత రాష్ట్రం హర్యానాకి తరలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు.శనివారం ఆయన ఏరియా ఆసుపత్రిలో ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల బంధువులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలలో వసతి సౌకర్యం కల్పించకపోవడం ప్రభుత్వ వైఫల్యమని చెప్పారు. ఈ పాఠశాలల్లో పని చేస్తున్న ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారికి రక్షణ కల్పించాలని కోరారు. వాగులపై వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

19న భూ సమస్యలపై చలో కలెక్టరేట్

వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

జిల్లాలో దళిత, గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 19న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని వెల్లడించారు. శివ్వాం దళితుల భూమి సమస్య పరిష్కరించాలని వ్యకాస ఆధ్వర్యాన చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు జియ్యమ్మవలసకు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ శివ్వాం దళితుల సమస్యపై రెవెన్యూ అధికారులు కావాలనే తాత్సారం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్యాక్రాంతమైన భూములన్నీ పేదలకు అప్పచెబుతామని చెప్తుందని కానీ క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదని తెలిపారు. జిల్లాలో దళితులు, గిరిజనులు, పేదల భూములు అనేకం అన్యాక్రాంతం అయ్యాయని చెప్పారు. పట్టాలిచ్చి భూములు చూపించలేదని, భూమి సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇవ్వలేదని వివరించారు. 10 ఎకరాల వరకు సాగు చేస్తున్న గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వలేదన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పేదలంతా కదలి రావాలని కోరారు. దీక్షలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కోరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గరుగుబిల్లి శ్రీనివాసరావు, దాలి నాయుడు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షా శిబిరంలో కూర్చున్న వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

కొమరాడ : ఈ నెల 19న జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శనివారం కోనేరు సంతలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన ప్రచారం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ప్రసాద్, సుందర్‌రావు, చెంబరు బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివ నాయుడు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

బాల్య వివాహాలు వద్దని, చదువే ముద్దు అని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ అన్నారు. శనివారం పార్వతీపురంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యాన బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించినా, పెళ్లి చేసినా లక్ష రూపాయలు జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగితే ఆ గ్రామంలో మహిళా సంరక్షణ కార్యదర్శికి, టోల్ ఫ్రీ నెంబర్ 1098 తెలియజేయాలని కోరారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్.ప్రసాదరావు మాట్లాడుతూ కౌమార దశలో తీసుకోవలసిన పౌష్టిక ఆహారం, చెడు స్పర్శ, మంచి స్పర్శ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒఆర్‌డబ్ల్యు ఆర్.హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరహాలగెడ్డలో పూడికలు తొలగింపు

పార్వతీపురం టౌన్ : పట్టణంలో వరహాలగెడ్డలో శనివారం పూడిక తీత పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, కమిషనర్ కె.శ్రీనివాస్ పర్యవేక్షించారు. అనంతరం కొబ్బరి బొండాల నుండి పీచుతీసే యంత్రాన్ని, ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణలో లభ్యమయ్యే అట్టలను పేపర్లను ప్యాకింగ్ చేసే యంత్రాలను ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న ప్రదేశంలో ఎంఆర్‌ఎఫ్ సెంటర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలన చేశారు. అనంతరం రైల్వే శాఖ ప్రస్తుతం 3వ లైన్ నిర్మాణం జరుగుతున్న దృష్ట్యా కొత్తవలసలో 9వ వార్డు విజయరామరాజు కాలనీ 2009లో నిర్మించిన కాలువలో మురుగునీరు ప్రవహించేందుకు అవకాశంలేక, కాలనీ చివరి ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో కొత్తగా సిసి కాలువ నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కమిషనర్‌కు ఛైర్‌పర్సన్ సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జయంతి, డిఇ కిరణ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మురళి, టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలు పాల్, నీరజ, శానిటేషన్ సెక్రెటరీలు అచ్యుత్, వెంకట్రావు, స్వరూప్, మేస్త్రిలు సాయి, రవి పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో టీకాలు

పార్వతీపురం రూరల్ : చిన్నారులకు నిర్ణీత సమయంలో టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.నారాయణ తెలిపారు. మండలంలో అడ్డపుశీల గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. చిన్నారులకు నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది టీకా వేస్తున్న తీరును గమనించారు. వ్యాక్సిన్‌ను తనిఖీ చేశారు. టీకా కార్డుల్లో తేదీల నమోదును పరిశీలించి, నిర్ణీత గడువు తేదీలను తల్లిదండ్రులకు విధిగా తెలియజేయాలన్నారు. అక్కడ ఉన్న తల్లిదండ్రులతో ఆయన మాట్లాడి పిల్లల ఆరోగ్య స్థితిపై అడిగి తెలుసుకున్నారు. మొదట 6 నెలలు తల్లిపాలతో మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారం లభిస్తుందన్నారు. టీకా వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయగౌడ్, ఎఎన్‌ఎం శాంతికుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సాలూరురూరల్ : గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని జాతీయ గిరిజనుల ఆర్థికాభివృద్ధి జోనల్ మేనేజర్ కృష్ణమోతి అన్నారు. మండలంలోని ఎపిజివిబి ఆధ్వర్యాన ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. గిరిజనులకు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు, పథకాలను ప్రవేశపెట్టి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మామిడిపల్లి బ్రాంచ్ మేనేజర్ వై.మధుసూదన్‌రావు, సర్పంచ్ రాజారావు, కృష్ణ పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

గరుగుబిల్లి : దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదర్ తెలిపారు. ఉల్లిభద్ర వద్ద ఉన్న ఉద్యాన కళాశాలలో శనివారం సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎలాంటి సంఘ విద్రోహచర్యలకు పాల్పడవద్దన్నారు. సమయపాలన చాలా అవసరమన్నారు. ఆడపిల్లలు సమాజం పట్ల, చట్టలపట్ల అవగాహనా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది టి.జోగారావు, ఎం.వెంకటరమణ, కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్న కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ బి.హరిరామ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు గుమ్మలక్ష్మీపురంలో కలెక్టర్ పర్యటన

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొరడ, రాయగడ జమ్ము గ్రామాల్లో ఆదివారం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పర్యటించనున్నారు. గిరిజన జీవనం స్థితిగతులు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో మాట్లాడి వారు పండించే పంటలను పరిశీలించనున్నట్లు జట్టు ట్రస్టు సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి షార్ట్‌సర్క్యూట్

సీతంపేట : సీతంపేట ఐటిడిఎలో శిథిలావస్థలో ఉన్న కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో మంటలు రేగి లోపల ఉన్న కొంత ఫర్నిచర్ కాలిపోయింది. ఒకప్పుడు ఇదే విశ్రాంతి భవనంలో కలెక్టర్లు, మంత్రులు, ఉన్నత అధికారులు విశ్రాంతి తీసుకునేవారు.

లైన్‌మేన్ ఖాళీలను భర్తీ చేయాలి

కొమరాడ : మండలంలో విద్యుత్ లైన్‌మేన్ ఖాళీలను భర్తీ చేయాలని టిడిపి మండల అధ్యక్షులు ఎస్.శేఖర్ పాత్రుడు కోరారు. శనివారం ఎమ్మెల్యే జగదీశ్వరి ఇచ్చిన సిఫార్సు లేఖను ట్రాన్స్‌కో ఎస్ఇకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ మండలం కావడంతో పూర్తిస్థాయిలో లైన్‌మేన్లు లేక విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వర్షాకాలంలో ఎక్కడైనా సమస్య తలెత్తితే సరఫరాను పునరుద్ధరించడంలో తీవ్ర జాప్యమవుతోందని చెప్పారు. ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు పి వెంకట్ నాయుడు ఉన్నారు.

యువ ఐఎఎస్‌లను పిఒలుగా నియమించాలి

పార్వతీపురం టౌన్ : యువ ఐఎఎస్‌లను సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎలకు పిఒలుగా నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. 15 రోజుల్లో పిఒలను ఆకస్మికంగా బదిలీలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం 10 రోజులైనా రెగ్యులర్ పిఒలను నియమించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఐటిడిఎలకు రెగ్యులర్ పిఒలు లేకుండా గిరిజన సంక్షేమం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఐటిడిఎ పాలక వర్గ సమావేశాలు ఏర్పాటు చేసి గిరిజన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన కొటికిపెంట ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల మృతికి సంతాపం తెలిపారు. అన్ని వసతులతో ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.

అధిక దిగుబడుల కోసమే 'పొలంబడి'

పాచిపెంట : రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎఒ తిరుపతిరావు తెలిపారు. మండలంలోని పెదకంచూరు, ఇప్పలవలస, రాయివలస, శతాభి గ్రామాల్లో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పోడు వ్యవసాయంలో దిగుబడులు చాలా తక్కువ ఉంటున్నాయని ఆయన తెలిపారు. ఎకరా పోడుకి కనీసం రెండు క్వింటాల చోడి దిగుబడి రావటం కష్టంగా ఉందన్నారు. దిగుబడులు పెరగాలంటే మేలైన వ్యవసాయ పద్ధతులు ఆచరించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు భారతి, కిరణ్, రైతులు పాల్గొన్నారు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం

గుమ్మలక్ష్మీపురం : తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ప్రకృతి వ్యవసాయ పంటలపై దృష్టిపెట్టాలని ప్రకృతి వ్యవసాయం అసోసియేట్ జి అన్నపూర్ణ అన్నారు. మండలంలోని టెంకసింగి గ్రామంలో కుమ్మరిక సుగ్రీవులు, మండంగి శ్రీహరి క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు ఇచ్చారు.

ఇ-పంట నమోదు

సీతానగరం : మండలంలోని చినబోగిలి, లచ్చయ్యపేట గ్రామాల్లో శనివారం చేపట్టిన ఇ-పంట నమోదును మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఇ-పంట నమోదు చేసుకోవాలన్నారు.

భామిని : ఇ-పంట నమోదుతో రైతులకు మేలని ఎఒ కె.సింహాచలం తెలిపారు. మండలంలో 16 రైతు సేవా కేంద్రాలలో ఇ -పంట నమోదు చేపడుతున్నట్లు తెలిపారు.

పండ్లు, రొట్టెలు పంపిణీ

సీతంపేట : ట్రాన్స్‌కో ఎఇ జి.నీలిమ కుమారుడు పుట్టినరోజు సందర్భంగా సీతంపేట ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎంపిడిఒ గీతాంజలి, జిసిసి మేనేజర్ గొర్లె నరసింహులు చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, సత్యసాయి సేవా కమిటీ సభ్యులు పకీర్ నాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యా మేలి మకుటం.. హడ్డుబంగి ఆశ్రమం

- కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల
- ఏటా టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత
- పాఠశాలలో చదువుకోవడానికి పోటీపడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల

సీతంపేట ఐటిడిఎకు కూతవేటు దూరంలో ఉన్న హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుకోవడానికి విద్యార్థులు పోటీపడుతున్నారు. మెయిన్ రోడ్డు పక్కనే ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఈ పాఠశాలలో అత్యుత్తమమైన విద్యను అందిస్తున్నారు. కార్పొరేట్ తరహాలో అందమైన భవనాలు ఇక్కడి ప్రత్యేకత. విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ప్రతి ఏటా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం ఈ పాఠశాల ఘన చరిత్రను చెబుతోంది. దీంతో సీతంపేట మండలం నుంచి కాకుండా భామిని, కొత్తూరు, హిరమండలం, పాతపట్నం తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులను ఈ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఈ పాఠశాలలో ఆరు నుండి పదో తరగతి వరకు 600 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. ఇక వివిఐపిలు, కలెక్టర్, పిఒ, ప్రజాప్రతినిధులు ఎవరు వచ్చినా ఈ పాఠశాలను సందర్శిస్తారు. ఎందుకంటే విద్యా ప్రమాణాలే కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వం అమలు చేసిన మెనూ అమలు చేయడంలో ఈ పాఠశాల ఒక అడుగు ముందే ఉంటుంది. అయితే గత ఏడాది నుంచి సిబిఎస్ఇ సిలబస్ మార్చారు. అయినా, ఏమాత్రమూ విద్యలో తగ్గకుండా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించేందుకు ప్రధానోపాధ్యాయులు బి. ఉమావాణి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కమిటీ

హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల... మన్యంలో ఈ పాఠశాల గురించి తెలియనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. అంతలా మార్మోగింది ఈ పాఠశాల పేరు. అత్యుత్తమ విద్య, క్రమశిక్షణ, ఆహ్లాదకర వాతావరణం, పకడ్బందీగా మెనూ అమలు.. ఇలా అన్నింటికీ చిరునామాగా నిలిచింది. కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా తయారైంది. పదో తరగతి ఫలితాల్లో చెక్కు చెదరని రికార్డులా ఏటా నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తూ వస్తోంది. అందుకే ఈ పాఠశాలలో తమ పిల్లలను చదివించాలని ప్రతిఒక్క తల్లిదండ్రీ ఆశ పడుతుంటారు. అందువల్లే ఆ పాఠశాలలో సీట్లకు ఎనలేని డిమాండ్ కూడా ఉంది.

విద్యార్థులపై ఫోకస్

హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఉదయం ఐదు గంటల నుండి 6 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకు విద్యార్థినులకు ప్రత్యేకంగా చదివిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి 'ఫోకస్ విద్యార్థులు' అనే పేరుతో గ్రూపులుగా విభజించారు. వెనుకబడిన విద్యార్థులకు ఎటువంటి సందేహాలున్నా ఎ-గ్రేడ్ విద్యార్థులు నివత్తి చేస్తారు. అప్పటికీ ఆ సందేహాలు నివృత్తి కాకుంటే స్టడీ టీచర్ చెప్తారు. దీనివల్ల అందరూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

ప్రతి ఏటా నూరు శాతం ఉత్తీర్ణత

ఇక్కడ చదువుతున్న విద్యార్థులపై ఆరో తరగతి నుంచి ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉంటారో, దానిపై ప్రత్యేకంగా ఫోకస్ చేస్తారు. దాంతోపాటు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేకంగా శ్రద్ధ కనబరిచి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఇలా నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి పక్కా ప్రణాళికలు రూపొందిస్తారు

అటల్ టింకరింగ్ ల్యాబ్‌కు ఎంపిక

సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఎనిమిది పాఠశాలు అటల్ టింకరింగ్ ల్యాబ్‌కు ఎంపికైతే అందులో హడ్డుబంగి ఆశ్రమ ఉన్నత పాఠశాల ఒకటి. వీటిలో ప్రతి ఏడాది ల్యాబ్ నిర్వహణకు రూ.50 వేలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయి. ఇక్కడ ల్యాబ్ నిర్వహణ బాగుందని కమిటీ కితాబిచ్చింది.

పకడ్బందీగా మెనూ

ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వం రూపొందించిన మెనూ అలానే అమలు చేస్తున్నారు. ఉదయం టిఫిన్‌లో ఉప్మా, పూరి, ఇడ్లీ, పెసర పొంగలి, పులిహోర, కిచిడి రోజుకొకటి పెడుతున్నారు. వారానికి ఆరుసార్లు గుడ్లు, ఆదివారం మధ్యాహ్నం బిర్యానీ, చికెన్, మంగళవారం రాత్రి చికెన్, విద్యార్థులకు సాయంత్రం నాలుగు గంటలకు స్నాక్స్, పాలు అందిస్తున్నారు. పాఠశాలలో పూల మొక్కలతోపాటు వంకాయలు, బెండకాయలు, బీర, కాకర, ఆనప, తదితర రకాల కూరగాయలు సాగుచేస్తున్నారు. వీటిని కూడా సేంద్రియ పద్ధతిలో పెంచుతున్నారు. ఆ కూరగాయలను పాఠశాలలో వంటల్లో వినియోగిస్తున్నారు.

ప్రోత్సాహక తరగతులు



వెనకబడిన విద్యార్థులపై ఫోకస్ అనే పేరుతో ప్రోత్సాహక తరగతులు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ఇంగ్లీషులో రాయించడం, మాట్లాడించడంపై ఎక్కువగా సాధన చేయిస్తున్నాం. బిడియం భయం లేకుండా విద్యార్థులతో స్నేహంగా మాట్లాడి సులభ పద్ధతుల్లో సందేహాలు నివృత్తి చేస్తున్నాం. ముందుగా ఎక్కువ సమయం ఇంగ్లీషులో మాట్లాడాలని విద్యార్థులకు కూడా చెప్పాం. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాం.

- బి.ఉమావాణి, ప్రధానోపాధ్యాయులు, హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల

సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు

అధికారుల తీరుపై ఎంపిపి శ్యామల అసంతృప్తి

ప్రజాశక్తి-కొమరాడ

మండల సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని ఎంపిపి శెట్టి శ్యామల, సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి భర్త, సీనియర్ నాయకులు శెట్టి మధుసూదన్ రావు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వివిధ శాఖ అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి మండలంలో ఎరువులు కొరత కొంచెం ఉన్నప్పటికీ రైతులకు అవసరమైన ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు. 7330 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయినట్లు తెలిపారు. ఎరువుల కొరతతో రైతులు బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారని తొడుము సర్పంచ్ సింహాచలం, విక్రాంపురం ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకట్ నాయుడు అన్నారు. ఆర్‌బికెలో ఉన్న ఎరువులు వివరాలతో పాటు ధరలు వివరాలను తెలియజేసేలా బోర్డులు పెట్టాలని సూచించారు. అనంతరం ఎంఇఒ జామి నారాయణ స్వామి, ఇరిగేషన్ మండల ఇంజనీరింగ్ అధికారి, హౌసింగ్, వెలుగు, ఉపాధి హామీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. అనంతరావు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నవీన్ మండలంలో అమలవుతున్న మంచినీటి పథకాలు వివరాలను వెల్లడించారు. ఆ సమయంలో జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి మాట్లాడుతూ మండలంలోని గంగరేగువలస గ్రామంలో జలజీవన్ మిషన్‌లో ఏర్పాటుచేసిన ఇంటింటి కుళాయిల ద్వారా సక్రమంగా నీరు అందడం లేదని తెలిపారు. ఈ సమస్య కొన్ని నెలలుగా చెబుతున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్‌పిటిసి గ్రామంలోనే మంచినీటి సమస్య పరిష్కరించకపోతే మరి మిగిలిన గ్రామాల పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. అదే సమయంలో మిగిలిన ప్రజా ప్రతినిధులు అందరూ ఇంజినీరింగ్ అధికారి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ అక్కడక్కడ పనులు నిలిపేసి మిగిలిన పనులు పూర్తి చేయకున్నా ఇంజినీరింగ్ అధికారి నవీన్ చర్యలు తీసుకోకుండా, వారికి వత్తాసు పలకడం సరికాదని మండిపడ్డారు. మరోవైపు కాంట్రాక్టర్ నుంచి సబ్ కాంట్రాక్టర్ తీసుకొని ఇంజనీరింగ్ అధికారి పలు ప్రాంతాల్లో ట్యాంకు పనులు చేయించారని పలువురు సభ్యులు ఆరోపించారు. ఈ విషయంపై ఎంపిడిఒ మల్లికార్జునరావు స్పందించి, తక్షణమే సభ్యులు తెలియజేసిన సమస్యను వారం రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఎఇ నవీన్‌ను ఆదేశించారు. సమావేశంలో తెలియజేసిన ప్రతి సమస్యకు వచ్చే సమావేశానికి పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నంగిరెడ్డి శరత్ బాబు, ఉప తహశీల్దార్ శివయ్య, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎఇని నిలదీస్తున్న జెడ్‌పిటిసి లక్ష్మి

సమస్యలు పరిష్కరించాలని నిరసన

మండలంలోని సమస్యలను పరిష్కరించేలా మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించిన నేపథ్యంలో కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. సాంబమూర్తి మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సమస్యనూ పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్‌లో కంప్యూటరీకరణ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పనులు వెంటనే పూర్తిచేయాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శనివారం కలెక్టరు చాంబరులో సహకారశాఖ అధికారులు, డిసిసిబి బ్యాంచి మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఎసిఎస్‌ల్లో కంప్యూటరీకరణ పనులు సహకార రంగంలో విప్లవాత్మకమార్పులు తీసుకువస్తాయని తెలిపారు. సంఘాల కార్యకలాపాల్లో పారదర్శకత పెరుగుతుందని, రైతులలో పిఎసిఎస్ పనితీరులో విశ్వసనీయత పెరుగుతుందని చెప్పారు. నూరు శాతం కంప్యూటరీకరణ పనులు మూడురోజులలో పూర్తికావాలన్నారు. డేటా సేకరణలో తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు సహకారం తీసుకోవాలని, సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. బ్యాంకులలో రుణం తీసుకున్న వారి వివరాలే కాకుండా సహకార సంఘాలలో సభ్యత్వం కలిగిన సభ్యులందరి వివరాలను కంప్యూటరీకరించాలన్నారు. కంప్యూటరీకరణ ప్రక్రియ పర్యవేక్షణ భాద్యతలను మండల ప్రత్యేక అధికారులకు అప్పగించాలని జెసి ఎస్.ఎస్.శోబికను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి పి.శ్రీరామ్మూర్తి, డిసిసిబి బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసి ఎన్నికలు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలో చిలకలపల్లి జెడ్‌పిహెచ్ఎస్, నారంనాయుడువలస, అజ్జాడ ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నారంనాయుడువలస జెడ్‌పిహెచ్ఎస్, గంగాడ, పి.చాకరాపల్లిలో కోరం లేక వాయిదా పడినట్లు ఎంఇఒ సామల సింహాచలం తెలిపారు.

మళ్లీ వాయిదా

సీతానగరం : మండలంలోని అంటిపేట, నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, కొత్తవలస ప్రాథమిక పాఠశాల యాజమాన్య కమిటీలు ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఇఒ తెలిపారు. మూడు పాఠశాలల్లో కోరం లేక వాయిదా పడినట్లు తెలిపారు.

జియ్యమ్మవలస : మండలంలోని పెదబుడ్డిడి మండల పరిషత్ పాఠశాలలో యాజమాన్య కమిటీ ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంఇఒ ముదిరి శ్రీనివాసరావు తెలిపారు. చినమేరంగి ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు బందోబస్తు ఏర్పాటుచేశారు.

'సంపూర్ణ పోషణ'ను విజయవంతం చేయాలి

పార్వతీపురంరూరల్ : జిల్లాలో సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జరిగిన కార్యక్రమంలో సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు పౌష్టికాహార నిర్వహణపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని మహిళా, శిశు సంక్షేమ శాఖను ఆదేశించారు. 8న జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహిస్తూ విద్యాసంస్థల్లో వ్యాసరచన, డ్రాయింగ్ వంటి పోటీలను నిర్వహించాలని అన్నారు. 17న వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, 25న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశాకార్యకర్తలు గర్భిణులకు ఆరోగ్య విషయాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు.

ఫీల్డ్‌అసిస్టెంట్, మేట్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఉపాధి హామీ కూలీలపై దాడికి పాల్పడిన ఫీల్డ్‌అసిస్టెంట్, మేట్‌పై చర్యలు తీసుకోవాలని ఎపిఒ రామకృష్ణకు పెదబోరబంద పంచాయతీ దేవుబుచ్చంపేట ఉపాధి కూలీలు శనివారం ఫిర్యాదుచేశారు. కూలి డబ్బులు అడిగినందుకు కొడతారా? అని కూలీలు ప్రశ్నించారు. ఉపాధిలో ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు.

ఎపిఒకు ఫిర్యాదు చేస్తున్న కూలీలు

తాగునీటి సమస్యపై శాశ్వత ప్రణాళికలు

ఎమ్మెల్యే విజయచంద్ర

పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వెల్లడించారు. శనివారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆయన ఇంజినీరింగ్ విభాగం ఎఇలు జి.ఆనంద్, సన్యాసిరావుతో మాట్లాడారు. పలు విభాగాలను పరిశీలించి, ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో అలసత్వం ఉండకూడదని సూచించారు. అనంతరం నవిరి కాలనీ శివారులో ఉన్న బూస్టర్ పంప్ హౌస్‌ను, తోటపల్లి వద్దనున్న ఉన్న ఇన్ ఫిల్టరేషన్ బావులను, పంప్‌హౌస్ ను పరిశీలించారు. వర్షాకాలంలో ఇన్ ఫిల్టరేషన్ బావుల ద్వారా రంగుమారిన నీటి సరఫరా ఎందుకు జరుగుతుందని, బావులలో బురద నీరు చేరడంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు శుద్ధ జలాలను అందించే దిశగా ప్రతిపాదనలు చేసి శాశ్వత ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ బార్నాల సీతారాం, 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, జనసేన పార్టీ నాయకులు చందక అనిల్, టిడిపి నాయకులు సుంకరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆ విద్యుత్తు స్తంభాలను తొలగించాలి

పార్వతీపురం రూరల్ : పాఠశాలల ఆవరణలో ప్రమాదకరంగా మారిన విద్యుత్తు స్తంభాలను తొలగించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆ శాఖ అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భవనాలను తాగుతూ వెళుతున్న విద్యుత్తు లైన్‌ను ప్రధానోపాధ్యాయుల కోరిక మేరకు పరిశీలించారు. వెంటనే ఇఇ కె.గోపాల్‌నాయుడు, డిఇ సిహెచ్‌వి రమణను పాఠశాలకు పిలిపించారు. సాధ్యమైనంత త్వరగా వీటిని తొలగించాలని ఎమ్మెల్యే కోరారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి సూచన మేరకు సమస్యను పరిష్కారానికి ప్రయత్నిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు గొరజాన చంద్రమౌళి, బోను చంద్రమౌళి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, జాగాన రవికుమార్, శంకరాపు శంకరరావు, కోట శ్రీధర్, బేత లక్ష్మణరావు, మాంధాత నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'వేదాంత' ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో శనివారం వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదాంత జూనియర్ కళాశాల మెంటర్ పి.అప్పారావు, డైరెక్టర్ ఎస్ఎల్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సౌజన్య హాస్పిటల్ డైరెక్టర్ పిబిపిఆర్ నాయుడు (నాని), ఆర్‌డిఒ హేమలత, ఎస్ఐ బి.రవీంద్ర రాజ్, ప్రజాకవి జి.గౌరునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి, క్రీడలను, విద్యను దగ్గర చేసుకోవాలన్నారు. ఆర్‌డిఒ హేమలత మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో ఉండాలని సూచించారు. అనంతరం ఐఐటి, నీట్‌లో సీట్లు సాధించిన సందీప్, పి.హరిప్రియను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఎన్ఐటి, సీనియర్, జూనియర్ ఇంటర్ పరీక్ష ఫలితాలలో జిల్లా టాపర్లుగా మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీన్ రమణ బాబు, వైస్ ప్రిన్సిపల్ శ్రీలోకేష్, రామారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థి, తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఆర్‌డిఒ హేమలత

అధ్వానంగా ఎగువద్వారబంధం రహదారి

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో మర్రిపాడు పంచాయతీ ఎగువ ద్వారబంధం రహదారి అధ్వానంగా తయారైంది. రాళ్లు తేలిన ఈ రహదారిపై కనీసం నడవలేని స్థితి నెలకొంది. అత్యవసర సమయంలో అంబులెన్స్, ఫైరింజన్ వంటివి వెళ్ళలేని పరిస్థితి. ఏజెన్సీలో ఇలా చాలా రహదారులు రాళ్లు తేలి ఉన్నాయని, అధికారులు స్పందించి రహదారి నిర్మాణాలు చేపట్టాలని గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు.

రాళ్లు తేలిన రహదారి

చదును చేస్తున్న జెసిబి

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

పెదమేరంగి నుంచి సీమనాయుడు వలస జంక్షన్ వరకు రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. ఈ రహదారిపై ఇబ్బందులను కొంతమంది యువత ఎమ్మెల్యే జగదీశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు.